సాక్షి రంగారెడ్డి
సోమవారం ı 9 ı జనవరి ı 2023



ఆధ్యాత్మిక శోభితం

ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వేంకటగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. 8లో▸

చలి @ 12.8 డిగ్రీలు

సాక్షి, సిటీబ్యూరో: కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పడిపోవడంతో చలితీవ్రత మళ్లీ పెరిగింది. ఆదివారం కనిష్టంగా 12.7, గరిష్టంగా 28.7 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాధారణం కంటే 3 డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవడంతోపాటు కిందిస్థాయి గాలుల కారణంగా చిన్నారులు, వృద్ధులు, రోగులు, వాహనదారులు గజగజ వణికిపోయారు.

ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సుల విద్యార్థుల జాబితా విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సుల్లో సీట్లు సాధించిన విద్యార్థుల మొదటి జాబితాను విడుదల చేసినట్లు టీఎస్ సీపీజీఈటీ-2022 కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు. ఓయూతో పాటు ఇతర వర్సిటీల్లో సీటు సాధించిన 531 మంది విద్యార్థుల జాబితాను వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఈ నెల 11 వరకు ఆయా కాలేజీల్లో రిపోర్టు చేయాలన్నారు.

న్యూస్‌రీల్

ఒకదానికొకటి.. ఐదు కార్లు ఢీకొట్టి



ప్రమాదంలో ధ్వంసం అయిన కారు

తుర్కయంజాల్: ఒకదానికొకటి ఐదు కార్లు ఢీకొట్టిన సంఘటన సాగర్ రహదారిపై ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని రాగన్నగూడలో చోటు చేసుకుంది. వివరాలివీ.. ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో సబ్ స్టేషన్ ఎదురుగా ఎగ్జిట్ టువెల్ హోటల్ వద్ద వ్యాగన్ ఆర్ కారు (టీఎస్07హెచ్ఎక్స్1578) డ్రైవర్ సిగ్నల్ వేయకుండా యూటర్న్ తీసుకునేందుకు ప్రయత్నించాడు. వెనుక నుంచి వేగంగా వస్తున్న మారుతి ఎర్టిగా కారు (ఏపీ23ఏఎల్ 6607) డ్రైవర్ సడెన్ బ్రేక్ వేశారు. దీంతో ఆ వెనుకే వస్తున్న టయోటా ఇటియోస్ (టీఎస్08 యూబీ8546), ఇన్నోవా క్రిస్టా (టీఎస్08హెచ్‌జీ6699), ఫోర్డ్ కారు (టీఎస్07 ఈజీ 2727) కార్లు ఒకదానికొకటి వెనుక నుంచి బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇన్నోవా, ఫోర్డ్ కార్లు ఎక్కువగా ధ్వంసం అయ్యాయి. మిగతా కార్లు స్వలంగా డ్యామేజ్ కాగా ప్రమాదానికి కారణమైన వ్యాగన్ ఆర్ కారుకు ఏమీ కాలేదు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఒకేసారి ఐదు కార్లు ఢీకొనడంతో భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది.

'అభియాన్ యాత్ర'ను జయప్రదం చేయండి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రజా సమస్యలను అధ్యయనం చేస్తూ, ప్రజలకు అండగా నిలిచేందుకు కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో ఈ నెల 26 నుంచి జిల్లాలో చేపట్టనున్న హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం గాంధీభవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం కొట్లాడాలని సూచించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్, అధికారప్రతినిధి సంకెపల్లి సుధీర్‌రెడ్డి, కోటింరెడ్డి వినయ్‌రెడ్డి, కాసు వినయ్‌రెడ్డి, వేణుగౌడ్, దేప భాస్కర్‌రెడ్డి, జైపాల్, చిగిరింత పారిజాత, ఏనుగు జంగారెడ్డి, దండెం రామిరెడ్డి, శివకుమార్, వసంతం, సులోచన, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములపై హక్కులు కల్పించాలి

మొయినాబాద్: ప్రభుత్వం అసైన్డ్ భూములపై పేదలకు సంపూర్ణ హక్కులు కల్పించాలని అసైన్డ్ భూమి సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మొయినాబాద్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పేదలు సాగుచేసుకుంటున్న భూములను ప్రభుత్వం వారి నుంచి తీసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని ఆరోపించారు. అసైన్డ్ భూములను తిరిగి తీసుకోకుండా రైతులకు పూర్తి హక్కులు ఇవ్వాలన్నారు. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేసేందుకు సిద్ధమవుతున్నామని.. అందులో భాగంగా త్వరలోనే మండలాల వారీగా కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో అసైన్డ్ భూమి సమితి మండల ఉపాధ్యక్షుడు క్యామ రవీందర్, నాయకులు జంగయ్య, రాజురెడ్డి ఉన్నారు.

బాటసింగారం నుంచి పండ్ల మార్కెట్ తరలించొద్దు

ఇబ్రహీంపట్నం: బాటసింగారం నుంచి పండ్ల మార్కెట్‌ను తరలించొద్దని ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన పలువురు పండ్ల తోటల రైతులు డిమాండ్ చేస్తున్నారు. పండ్ల మార్కెట్ గడ్డిఅన్నారంలో కొన్నేళ్లపాటు కొనసాగిందని.. పెరుగుతున్న అవసరాలకు తగ్గట్టు మార్కెటింగ్ రవాణా సదుపాయాలు లేకపోవడంతో కోహెడకు తరలించారన్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో కోహెడ మార్కెట్ దెబ్బతినడంతో విజయవాడ-హైదరాబాద్ ప్రధాన రహదారిలోని బాటసింగారానికి మార్చినట్లు తెలిపారు. రైతులంతా అంగీకరించడంతో అక్కడ నిర్మాణాలు చేపట్టి పండ్ల తోటల రైతులు, వ్యాపారులకు సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. ఇప్పుడు కొంతమంది వ్యాపారులు వారి స్వలాభం కోసం బాటసింగారం పండ్ల మార్కెట్‌ను మామిడిపల్లికి తరలించాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పండ్ల మార్కెట్‌ను తరలించకుండా ఉండేందుకు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని సోమవారం ఇబ్రహీంపట్నంలోని క్యాంపు కార్యాలయంలో కలవాలని నిర్ణయించినట్లు చెప్పారు. నియోజకవర్గంలోని మామిడి, జామ, సపోట, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్, బత్తాయి, నిమ్మ, అల్లనేరేడు తదితర పండ్లను సాగుచేసే రైతులంతా తరలిరావాలని కోరారు.

భవితకు 'తొలిమెట్టు'

కనీస అభ్యసన సామర్థ్యమే లక్ష్యం

- ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ
- చదువులో వెనుకబడ్డ వారిని గుర్తించి రాణించేలా ప్రత్యేక కార్యాచరణ
- వారంలో ఐదు రోజులు బోధన, ఒకరోజు మూల్యాంకనం



కొత్తూరు పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ (ఫైల్)

కొత్తూరు: ప్రాథమిక స్థాయి నుంచే పిల్లల్లో కనీస విద్యా సామర్థ్యాలను పెంచేందుకు ప్రభుత్వం, విద్యాశాఖ గతంలో ఆర్ఆర్ఆర్, ఏబీసీ పేరుతో వివిధ కార్యక్రమాలు అమలు చేసింది. క్షేత్రస్థాయిలో వీటి అమలు తీరులో ఉన్న లోపాల కారణంగా అనుకున్న లక్ష్యాలను సాధించలేకపోయింది. దీనికి తోడు కరోనా కారణంగా రెండేళ్ల పాటు వరుసగా సెలవులు రావడం విద్యావ్యవస్థపై ప్రభావం చూపింది. అప్పటి వరకు ఆఫ్‌లైన్‌లో చదువుకున్న విద్యార్థులకు ఆన్‌లైన్‌లో బోధన చేపట్టినప్పటికీ చాలామంది పాఠ్యాంశాలను అర్థం చేసుకోలేకపోయారు. ఈ క్రమంలో తిరిగి విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంచి చదువుపై మరింత ఆసక్తిని పెంచడానికి విద్యాశాఖ ఈ ఏడాది సెప్టెంబర్ 1నుంచి తొలిమెట్టు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 881 ప్రాథమిక పాఠశాలల్లో 61,869, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 18,960 మంది విద్యార్థులకు చదవడం, రాయడంతో పాటు పలు అంశాలపై ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

తొలిమెట్టు లక్ష్యాలు..

- ఒకటి నుంచి ఐదో తరగతి చదువుతున్న పిల్లల్లో విద్యాప్రమాణాలు పెంచడం.
- ఇందులో భాగంగా ఉపాధ్యాయులు మరింత సమర్థవంతంగా, విద్యార్థులకు సులువుగా పాఠ్యాంశాలు అర్థమయ్యే రీతిలో బోధించాలి.
- విద్యార్థుల్లో చదువుపై మరింత ఆసక్తిని పెంచేలా పలు ఉపకరణాలతో బోధన చేయాలి.
- ఈ విధానం ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాలు సులువుగా అర్థం కావడంతో పాటు చాలా రోజుల వరకు గుర్తుంటాయి.
- ఉపాధ్యాయులు చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారు కూడా ఉన్నతంగా రాణించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు పరచాలి.
- వారంలో ఐదు రోజుల పాటు బోధన, ఒకరోజు మూల్యాంకనం (ఐదు రోజుల పాటు చదువుకున్న సబ్జెక్టుల్లో పరీక్షలు) నిర్వహిస్తారు.

ఎంఎన్ఓ నిరంతర పర్యవేక్షణ

తొలిమెట్టు కార్యక్రమాన్ని పరిశీలించడానికి విద్యాశాఖ ప్రతి మండల కేంద్రానికి ఒక నోడల్ అధికారిగా అర్హత ఉన్న హెచ్ఎంను నియమించింది. ఆయన తన పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శిస్తూ కార్యక్రమం అమలు తీరును పరిశీలిస్తారు. ఇందులో భాగంగా విద్యార్థుల కనీస అభ్యసన సామర్థ్యాలను అంచనా వేస్తారు. చదువులో మెరుగుపడని పాఠశాలలను గుర్తించి అక్కడ ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు అందిస్తారు. అనంతరం జిల్లా స్థాయి అధికారులకు మండల నివేదికలను సమర్పించి ఏవైనా లోటుపాట్లుంటే పరిష్కరిస్తారు.

ఆసక్తి పెరుగుతుంది



తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా ప్రణాళిక బద్ధంగా చేపడుతున్న బోధన ద్వారా విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెరుగుతుంది. చదవడం, రాయడం లాంటి ప్రక్రియల్లో స్వతహాగా ప్రతిభ కనబర్చుతున్నారు. వారికి సులువుగా పాఠ్యాంశాలు అర్థమయ్యేలా బోధన సామగ్రితో బోధించడం జరుగుతుంది.

– శ్రీలత, హెచ్ఎం, కొత్తూరు ప్రాథమికోన్నత పాఠశాల

సామర్థ్యాలు మెరుగుపడుతున్నాయి



ఉపాధ్యాయుల ఆలోచనా విధానం, అన్వేషణ, పోటీతత్వంతో తొలిమెట్టు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. విద్యార్థులకు అర్థవంతంగా బోధన ఉండడంతో వారిలో కనీస అభ్యసన సామర్థ్యాలు పెరుగుతున్నాయి. చిన్నారులకు విషయ పరిజ్ఞానం అలవాటు పడి చదివిన పాఠ్యాంశాలపై పట్టు సాధించడానికి మరింత ఉపయోగపడుతుంది.

– కృష్ణారెడ్డి, ఎంఈఓ, కొత్తూరు



నిరుద్యోగులకు ప్రొసీడింగ్ కాపీలు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నిరుద్యోగ రహిత రాష్ట్రమే లక్ష్యం

- ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- షాద్‌నగర్‌లో జాబ్ మేళా
- తరలివచ్చిన యువతీయువకులు

షాద్‌నగర్‌రూరల్: నిరుద్యోగ రహిత రాష్ట్రమే ప్రభుత్వ లక్ష్యమని ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ యూత్ సర్వీసెస్ సహకారంతో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఆధ్వర్యంలో పట్టణంలోని రెడ్‌రోస్ ఫంక్షన్ హాలులో ఆదివారం నిరుద్యోగులకు జాబ్‌మేళా నిర్వహించారు. సుమారు 2వేల మంది యువతీయువకులు హాజరు కాగా 360 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. మరో 776 మందికి ఇంటర్వ్యూల ద్వారా అవకాశాలు కల్పించనున్నారు. జాబ్‌మేళాను పరిశీలించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో ఏ ప్రభుత్వం నిరుద్యోగులను పట్టించుకోలేదని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్న తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. రాష్ట్రానికి నూతన పరిశ్రమలను తీసుకు వచ్చేందుకు మంత్రి కేటీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. నిరుద్యోగులకు ఉపాధి చూపేందుకు ప్రభుత్వం చొరవ చూపుతుందన్నారు. అందులో భాగంగానే రాష్ట్రంలో వివిధ పరిశ్రమల యాజమాన్యాల సహకారంతో 6,500 మందికి ఉద్యోగ అవకాశాలను కల్పించాలనే ఆలోచనతో షాద్‌నగర్‌లో జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో ఎంతో మంది నిరుద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. 50 పరిశ్రమల ప్రతినిధుల సహకారంతో జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఉద్యోగాలు సాధించిన వారికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నియామకపత్రాలు అందించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మన్నె కవిత, స్త్రీ శిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ తాండ్రవిశాల, జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, ఎంపీపీ ఖాజాఇద్రీస్‌అహ్మద్, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజ్, మున్సిపల్ మాజీ చైర్మన్ అగ్గనూరి విశ్వం, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ మంజులరెడ్డి, కౌన్సిలర్లు ప్రతాప్‌రెడ్డి (చింటు), జూపల్లి కౌసల్య, చెట్లపావని, సర్వర్ పాష తదితరులు పాల్గొన్నారు.

దళితబంధుతో శాశ్వత ఉపాధి

షాద్‌నగర్: ప్రభుత్వం అమలు చేస్తున్న దళితబంధు పథకంతో అర్హులందరికీ శాశ్వత ఉపాధి లభిస్తుందని ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. దళితబంధు పథకం కింద మంజూరైన వాహనాలను పట్టణంలోని రెడ్‌రోస్ ఫంక్షన్ హాలులో ఆదివారం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. దళితులకు శాశ్వత ఉపాధి కల్పించాలనే ఆలోచనతో దళితబంధు పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికే దిక్సూచిలా మారిందన్నారు.

ఓయమ్మో.. ప్రాణం పాయే..




మహిళ మృతదేహం

- నన్ను సంపుతుండు అని కూతురుకు ఫోన్ చేసిన మహిళ
- చీర కొంగుతో గొంతు నులిమి హత్య
- వివాహేతర సంబంధమే కారణం

మొయినాబాద్: కీడును శంకించిన ఓ మహిళ తన హత్యకు ముందు కూతురుకు ఫోన్ చేసింది. ఓయమ్మో.. నా మానం పాయే.. ప్రాణం పాయే.. నన్ను సంపుతుండే అంటూ భయాందోళనతో చెప్పిన మాటలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. వివాహేతర సంబంధం పెట్టుకున్న ఓ మేస్త్రీ.. ఒంటరిగా ఉన్న సదరు మహిళను గొంతు నులిమి చంపాడు. ఈ సంఘటన మొయినాబాద్‌లో ఆదివారం వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ డీకే లక్ష్మీరెడ్డి కథనం ప్రకారం .. వికారాబాద్ జిల్లా దోమ మండలం మల్లేపల్లికి చెందిన పులుకుంట లక్ష్మి (50), రాములు దంపతులకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు సంతానం. నాలుగేళ్ల క్రితం బతుకుదెరువు కోసం మొయినాబాద్‌కు వచ్చారు. అద్దె గదిలో ఉంటూ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం మొగలమడక గ్రామానికి చెందిన హన్మంతు కొన్నేళ్లుగా మొయినాబాద్‌లో ఉంటూ మేస్త్రీ పని చేసేవాడు. మేస్త్రీ చేతి కింద పనికి వెళ్లిన లక్ష్మికి అతనితో పరిచయం ఏర్పడింది. అది కాస్తా వివాహేతర సంబంధానికి దారితీసింది. ఎనిమిది నెలల క్రితం లక్ష్మి భర్త రాములు మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె తన కొడుకుతో కలిసి సొంతూరు మల్లేపల్లికి వెళ్లి అక్కడే వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. పదిహేను రోజుల క్రితం కూలి పని కోసం మళ్లీ మొయినాబాద్‌కు వచ్చింది. అద్దె గదిలో ఉంటూ కూలి పని చేస్తోంది. విషయం తెలుసుకున్న హన్మంతు శనివారం రాత్రి ఆమె గదికి వచ్చాడు. అప్పటికే మద్యం తాగి ఉన్న అతడు తనను ఎందుకు పట్టించుకోవడం లేదని ఆమెతో గొడవకు దిగాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో కోపోద్రిక్తుడైన హన్మంతు.. చీర కొంగుతో లక్ష్మి మెడకు చుట్టి గొంతు నులిమి హత్య చేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కాగా, నిందితుడు హన్మంతును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

సంక్రాంతికి ఆర్టీసీ స్పెషల్



అఫ్జల్‌గంజ్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సుమారు 4,233 ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు ఈ బస్సులు అందుబాటులో ఉండనున్నాయి. ప్రయాణికులపై ఎలాంటి అదనపు భారం పడకుండా సాధారణ చార్జీలే వసూలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి 1,1184, ఎల్‌బీ నగర్ నుంచి 1,133, ఆరాంఘర్ నుంచి 814, ఉప్పల్ నుంచి 683, కేపీహెచ్‌బీ, బీహెచ్ఈఎల్ నుంచి 419 ప్రత్యేక బస్సులను నడపనున్నారు. మహాత్మాగాంధీ బస్ స్టేషన్‌కు అధిక రద్దీని తగ్గించడానికి నగర శివారు ప్రాంతాల నుంచే ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచనున్నారు. ఖమ్మం, నల్లగొండ, విజయవాడ వైపు వెళ్లే బస్సులు ఎల్‌బీ నగర్ నుంచి, మహబూబ్‌నగర్, కర్నూల్ వైపు వెళ్లే బస్సులు ఆరాంఘర్ నుంచి అందుబాటులో ఉండనున్నాయి. వరంగల్, హన్మకొండ, తొర్రూరు వైపు వెళ్లే బస్సులు ఉప్పల్ నుంచి, సత్తుపల్లి, భద్రాచలం, విజయవాడ వైపు వెళ్లే బస్సులు కేపీహెచ్‌బీ, బీహెచ్ఈఎల్ నుంచి అందుబాటులో ఉంటాయి. వెన్నెల, గరుడ ప్లస్, గరుడలతో పాటు బెంగళూరు వైపు వెళ్లే షెడ్యూల్, అంతర్రాష్ట్ర బస్సులు ఎంజీబీఎస్ నుంచి అందుబాటులో ఉంటాయి. ప్రయాణికులు టీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్ ద్వారా రిజర్వేషన్ చేయించుకోవచ్చని ఆర్టీసీ అధికారులు సూచించారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఎంజీబీఎస్‌లో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ఏవైనా సందేహాలుంటే ఫోన్ నంబర్ 99592 26257లో సంప్రదించాలని సూచించారు.

నేడు ఆర్టీసీ 'జీవా' జలం ప్రారంభం

అఫ్జల్‌గంజ్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ తలపెట్టిన టీఎస్‌ఆర్టీసీ ×జీవా× జలంను సోమవారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో ఉదయం 11.30 గంటలకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, రవాణా శాఖ ప్రభుత్వ కార్యదర్శి కేఎస్ శ్రీనివాస రాజు, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ చేతుల మీదుగా జీవా జలాన్ని ప్రారంభించనున్నారు.



మొక్క నుంచి డ్రాగన్‌ఫ్రూట్స్ కట్‌చేస్తున్న రైతు రవీందర్‌రెడ్డి



చెరువులో చేపలు పట్టేందుకు వల విసురుతున్న రైతు

రూటు మార్చి.. లాభాలు గడించి

- నష్టాల నుంచి గట్టెక్కేందుకు రైతుల కొత్త దారి
- వ్యవసాయ అనుబంధ రంగాల వైపు మొగ్గు చూపుతున్న వైనం
- డ్రాగన్ ఫ్రూట్స్ సాగు, చేపల పెంపకం
- ఒకరిని చూసి మరొకరు ఇదే మార్గం

కొందుర్గు: ఆహార, వాణిజ్య పంటలతోపాటు కూరగాయలు, ఆకుకూరలు, పూలతోటలు సాగులో అధిక పెట్టుబడులు పెట్టి నష్టాలపాలైన రైతులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. ఎక్కడో థాయ్‌లాండ్, వియత్నాం దేశాల్లో సాగుచేసే డ్రాగన్ పండ్ల తోటలతోపాటు చేపల పెంపకంపై దృష్టి సారిస్తున్నారు. ఎలాంటి చీడపీడలు ఆశించని, తక్కువ పెట్టుబడితో సాగుచేసే డ్రాగన్ పండ్ల తోటలను కొందుర్గు మండలం ఉమ్మెంత్యాల, ముట్పూర్ గ్రామాల రైతులు ఉద్యాన శాఖ అధికారుల సలహాలతో సాగు చేస్తున్నారు. ఫ్రూట్స్ పండించడంతోపాటు డ్రాగన్ మొక్కలకు సంబంధించిన నర్సరీని సిద్ధం చేసి ఇతర రైతులకు విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నారు. వ్యవసాయానికి అంతగా అనుకూలించని గరపనేలల్లోనూ తక్కువనీటితో ఈ పండ్లు సాగు చేయొచ్చని చెబుతున్నారు.

యూట్యూబ్ చూసి.. సాగు చేసి

కొందుర్గు మండలం ఉమ్మెంత్యాల గ్రామానికి చెందిన రైతు రవీందర్ రెడ్డి యూట్యూబ్ చూసి ఈ పంటను సాగుచేసి అధునాతన ఒరవడి సృష్టించాడు. సంగారెడ్డిలో ఓ రైతు సాగుచేసిన తోటను పరిశీలించి ఆయన అనుభవాలను తెలుసుకున్నాడు. డ్రాగన్ ఫ్రూట్స్ పీ పింక్ రకం మొక్కలు ఎంపిక చేసుకొని ఒక్కో మొక్కకు రూ.70 చొప్పున మాట్లాడుకొని 2 వేల మొక్కలు తెచ్చి మూడెకరాల్లో నాటాడు. ప్రస్తుతం మరో రెండువేల మొక్కలను స్వతహాగా తయారు చేసుకొని మరో మూడు ఎకరాల్లో నాటడంతోపాటు ఇతర రైతులకు మొక్కలను సిద్ధం చేశాడు. అతడిని చూసిన మరికొంతమంది రైతులు డ్రాగన్ తోటలను సాగుచేశారు. కేశంపేట, చేవెళ్ల, భూత్పూర్, మక్తల్, నారాయణపేట ప్రాంతాల్లోనూ డ్రాగన్ తోటలను సాగుచేస్తున్నారు.

దిగుబడి, మార్కెటింగ్..

ఈ పంట సాగుచేసిన 8 నెలలకు దిగుబడి ప్రారంభమవుతుంది. ఒక పండు 600 నుంచి 700 గ్రాములు ఉంటుంది. ఒక్కో మొక్కకు దాదాపు 25 కిలోల పండ్లు వస్తాయి. హైదరాబాద్‌లోని ఫ్రూట్ మార్కెట్లలో విక్రయిస్తున్నారు. కిలోకు రూ.150 నుంచి రూ.200 వరకు ధర పలుకుతుందని రైతులు చెబుతున్నారు.

చెరువులు తవ్వి.. చేపలు పెంచి

మరోవైపు మరికొంతమంది రైతులు చెరువులను తవ్వి చేపల పెంపకంపై దృష్టి సారించారు. ఒక్కో చేప పిల్లకు రూ.16 చొప్పున ఖర్చుచేసి నల్లగొండ నుంచి మూడు నెలల వయస్సు గల చేప పిల్లలను తెచ్చి చెరువుల్లో వదిలారు. అర ఎకరం విస్తీర్ణంలో పదివేల వరకు చేపపిల్లలను పెంచొచ్చని తెలిపారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం దాణా వేయాలని, 8 నుంచి తొమ్మిది నెలల వ్యవధిలో ఒక్కో చేప కిలో బరువు దాటుతుందని అంటున్నారు.

రెండో ఏడాది నుంచి దిగుబడి



డ్రాగన్ సాగుచేయడానికి మొదటగా పిల్లర్లు, డ్రిప్‌ల కోసం ఎకరాకు రూ.5 లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. మొదటి ఏడాది కాస్తా దిగబడి తక్కువగా ఉన్నా రెండో ఏడాది నుంచి పెరుగుతుంది. మూడు, నాలుగేళ్ల సమయంలో ఎకరాకు 50 నుంచి 80 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఖర్చులు పోను ఎకరాకు రూ.5 లక్షల దాకా లాభం వస్తుంది. ఈ పంట 30 ఏళ్ల వరకు దిగుబడి వస్తుంది.

– రవీందర్‌రెడ్డి, రైతు, ఉమ్మెంత్యాల

చేపల పెంపకంతో లాభాలు



15 గుంటల విస్తీర్ణంలో చెరువు తవ్వి 10 వేల చేపపిల్లలను వదిలాను. గుంత తవ్వడం, కవర్ వేయడం, చుట్టూ కంచె వేయడానికి రూ.5 లక్షల ఖర్చు వచ్చింది. దాణాకు మరో రూ.10 లక్షలు అయ్యింది. తొమ్మిది నెలల్లో ఒక్కో చేపపిల్ల కిలో బరువు వచ్చింది. ప్రస్తుతం చెరువు వద్దే కిలో రూ.310 చొప్పున విక్రయిస్తున్నాను. ఇప్పటికి 500 కిలోలు అమ్మగా మరో 6 వేల కిలోల వరకు దిగుబడి వస్తుంది. ఈ ఏడాది ఖర్చులు పోను రూ.5 లక్షల వరకు లాభం వస్తుంది. వచ్చే ఏడాది చేపపిల్లలు, దాణా ఖర్చు మాత్రమే ఉంటుంది. ఈ లెక్కన అర ఎకరం విస్తీర్ణంలో చెరువును తవ్వి చేపలు పెంచితే 10 నెలలకు రూ.10 లక్షలు సంపాదించొచ్చు.

– రాయికంటి శ్రీనివాస్‌రెడ్డి, ఉమ్మెంత్యాల

ఉపాధ్యాయుల చేతిలోనే దేశ భవిష్యత్

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కిషన్‌రెడ్డి తదితరులు

మంచాల/ఆమనగల్లు: దేశ భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంటుందని.. భారతదేశాన్ని విశ్వ గురువు స్థానంలో నిలిపేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోట్ల కాశీరావు, పూజారి రమేశ్ ఆధ్వర్యంలో నగరంలో క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సురధీర్, మహిపాల్‌రెడ్డి, సుమ, రజిత, శ్రీనివాస్‌రెడ్డి, విద్యావతి, శ్రీహరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

11న ఎమ్మార్పీఎస్ జాతీయ సదస్సు

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్



మాట్లాడుతున్న నరేశ్

కొత్తూరు: ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా ఈ నెల 11న బెంగళూరులో ఎమ్మార్పీఎస్ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోవింద నరేశ్ చెప్పారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని సిద్ధాపూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించారు. అనంతరం నరేశ్ మాట్లాడుతూ.. సమానత్వం, సమాజహితమే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ దేశ వ్యాప్తంగా పోరాటాలు సాగిస్తోందన్నారు. సమాజంలోని ఆర్థిక, సామాజిక, రాజకీయ అసమానతలను రూపుమాపి బహుజనులను చైతన్యం చేసేందుకు ఎమ్మార్పీఎస్ కృషి చేస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ, ఆసరా పెన్షన్లు, రేషన్ బియ్యంతో పాటు పలు పథకాలు ఎమ్మార్పీఎస్ చలువే అని గుర్తుచేశారు. వర్గీకరణ లక్ష్యంగా ఈ నెల11న బెంగుళూరులో జాతీయ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు సభలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంటనోళ్ల నరసింహ, అంతయ్య, రవికుమార్, కృష్ణ, అశోక్, నవీన్, మల్లేశ్, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

'వేదామృతం' పేరును విరమించుకోవాలి

బ్రాహ్మణ సంఘం డిమాండ్

హుడాకాంప్లెక్స్: రాష్ట్ర ప్రభుత్వం ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన నీరాకేఫ్‌లో కల్లు సీసాకు వేదామృతం అని పేరు పెట్టడం వేదాలను అవమానించడమేనని బ్రాహ్మణ సంఘం నాయకుడు వక్కలంక శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం సరూర్‌నగర్ డాక్టర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బ్రాహ్మణులను అవమానించేలా పేరు పెట్టడం సరికాదన్నారు. ఈ పేరును మార్చాలని బ్రాహ్మణ సంఘం డిమాండ్ చేస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని లేని పక్షాన బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఈశ్వర్, గంటి నగేశ్, శశిధర్, లోకవాణి పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని గౌరవించాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: భారతీయులంతా రాజ్యాంగాన్ని గౌరవించాలని ప్రముఖ కవి, ప్రకృతి ప్రేమికుడు జయరాజు అన్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడుకుందాం అనే అంశంపై వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఆదివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ.. భారత సమాజంపై హిందుత్వ శక్తులు ముప్పేట దాడి చేస్తున్నారని ధ్వజమెత్తారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. రాజ్యాధికారాన్ని సాధనంగా వినియోగిస్తూ హిందూ రాజ్యాన్ని స్థాపించాలని ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలు కుట్ర పన్నుతున్నాయని చెప్పారు. అభ్యుదయవాదులను భయపెట్టడానికే మేధావులపై దాడులు చేస్తున్నారని తెలిపారు. టీజేఏసీ కన్వీనర్ కోలా జనార్దన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజ్ఞానదర్శిని అధ్యక్షుడు రమేష్, ప్రొఫెసర్ సూరెపల్లి సుజాత, డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, జాన్‌వెస్లీ, నలిగంటి శరత్, వెంకటేష్, చౌహాన్, డీబీఎఫ్ కన్వీనర్‌శంకర్, డాక్టర్ జిలకర శ్రీనివాస్, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, చలపతిరావు, ఎస్‌ఎల్‌పద్మ, హన్మేష్, మత్స్యా దేవేందర్, ప్రొఫెసర్ హరగోపాల్, ఝాన్సీ పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల పేరిట టోకరా

బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు

బంజారాహిల్స్: డబుల్ బెడ్రూం ఇళ్లు ఇప్పిస్తానని 40 మంది నుంచి రూ.32లక్షలు వసూలు చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంటూ బాధితులు ఫిర్యాదు చేశారు. బంజారాహిల్స్ పోలీసులు రోడ్ నెంబర్–12 శ్రీరాంనగర్ బస్తీకి చెందిన గాలిబీ, అజీరా, మహ్మద్ గౌస్, మహ్మద్ ఇస్మాయిల్, సయ్యద్ వాజిద్‌లపై ఐపీసీ సెక్షన్ 406, 420ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. శ్రీరాంనగర్ బస్తీకి చెందిన గాలిబీ జీడిమెట్లకు చెందిన మహ్మద్ మహబూబ్ నుంచి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇప్పిస్తానంటూ, తాను కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్నానని నమ్మించింది. జియాగూడ, బాలానగర్‌లలో ఇళ్లు కేటాయిస్తామంటూ నమ్మబలకడంతో 40 మంది వరకు డబ్బులు ఇచ్చారు. ఏళ్లు గడుస్తున్నా ఇళ్లు మంజూరు కాకపోవడంతో తాము మోసపోయామని భావించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భళారే బోన్సాయ్!


- ఇంటీరియర్, ఎక్స్‌టీరియర్ కోసం విరివిగా మొక్కలు
- విలాసవంతమైన ఇళ్లలో కొత్త ట్రెండ్
- రూ.500 నుంచి రూ.5 లక్షల వరకు ధరలు
- విదేశాల నుంచి సైతం దిగుమతి చేస్తున్న నగర నర్సరీలు



సాక్షి, సిటీబ్యూరో: నగర జీవన శైలిలో వినూత్నంగా పుట్టుకొస్తున్న అధునాతన అలవాట్లు, అభిరుచులు ఎన్నో ఎన్నెన్నో! ముఖ్యంగా ఇంటి పరిసరాలను ఆకర్షణీయంగా మార్చుకోవడానికి నగరవాసులు అత్యంత ఆసక్తిని చూపిస్తున్నారు. దీని కోసం ప్రత్యేకంగా ఇంటీరియర్, ఎక్స్ టరియర్ డిజైనింగ్ అనే పద్ధతి ప్రారంభమైంది. ఇటీవల కాలంలో ఈ డిజైనింగ్‌లో బోన్సాయ్ మొక్కలు ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి. అంతేకాకుండా మొక్కల ప్రేమికులు కూడా ఈ బోన్సాయ్‌లను పెంచుకోవడం తమ ప్రత్యేకతగా మార్చుకుంటున్నారు. వీటి పైన ఆసక్తి కాస్త ఇదో ట్రెండ్‌గా మారి లక్షల విలువ చేసే బోన్సాయ్ మొక్కలను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు.

వీటి ప్రత్యేకత ఏమిటంటే..

బోన్సాయ్ అంటే.. మరుగుజ్జు మొక్కలు.. నగర జీవనంలో విశాలమైన స్థలం దొరకడం కష్టం. ఉన్న స్థలంలోనే ఎక్కువ మొక్కలు పెంచాలనుకునే వారు బోన్సాయ్‌ను ఎంచుకుంటున్నారు. అంతే కాదు ఈ మొక్కల్లోని వైవిధ్యం ప్రతి ఒక్కరినీ ఆకర్షిస్తుంది. పెద్ద, పెద్ద భారీ వృక్షాలను సైతం చిన్న తొట్టీలో పెంచుకోవడం ఈ బోన్సాయ్ ప్రత్యేకత. నగరం వేదికగా ఉన్న పలు నర్సరీల్లో రూ.500 నుంచి రూ.2– 3 లక్షల విలువ చేసే బోన్సాయ్ మొక్కలు అందుబాటులో ఉన్నాయి. 20, 30 సంవత్సరాల పైబడిన మొక్కలు రూ.10 లక్షలపైనే అమ్ముడవుతున్నాయి. కానీ ఇవి చాలా అరుదుగా లభిస్తుంటాయని నర్సరీ నిర్వాహకులు తెలిపారు. సహజంగా బోన్సాయ్ మొక్కలు 15 నుంచి 20 సెంటీమీటర్ల ఎత్తు మాత్రమే ఉంటాయి. పెద్ద పరిమాణంలో ఉన్నవి 30 నుంచి 60 సెంటీమీటర్లు ఉంటాయి. చాలా ఏళ్లుగా పెంచుతున్న మొక్కలైతే 1 నుంచి 1.5 మీటర్ల ఎత్తులో ఉంటాయి. వీటిలో ఇంటీరియర్ కోసం జేడ్, ఫైకస్ జిన్‌సెంగ్, కార్మోనా, ఆల్మస్ వంటి మొక్కలను బయట గార్డెన్‌లో పెంచడానికి బోగన్ విల్లియా, చింతకాయ వంటి బోన్సాయ్ మొక్కలను పెంచుతున్నారు. ఇంటి వాతావరణంలో ఆక్సిజన్ స్థాయిని పెంచడంలో ఈ మొక్కలు కీలకంగా పని చేస్తాయి. ఈ మొక్కలను కొందరు అదృష్టంగా కూడా భావిస్తారు. వీటి పెరుగుదల ఆకర్షణీయంగా ఉండటంతో ప్రశాంతమైన వాతావరణాన్ని ఏర్పరచడానికి పెంచుతున్నారు. వీటిని పెంచే సిరామిక్ తొట్టీలు అందంగా ప్రత్యేకంగా తయారు చేస్తున్నారు.



విభిన్న బోన్సాయ్‌లను పెంచుతున్నాను..



నా వద్ద 4 నుంచి 18 ఏళ్ల బోన్సాయ్ మొక్కలున్నాయి. అభిరుచిలో భాగంగా ఈ మొక్కలు పెంచుతున్నాను. రావి, మర్రి, ఫైకస్, మేడిపండు, చింత, వేప వంటి 25కు పైగా బోన్సాయ్ మొక్కలున్నాయి. స్వతహాగా బోన్సాయ్‌లను తయారు చేయడంలో కూడా నైపుణ్యం సాధించాను.

– డా.విష్ణువందన, అల్వాల్

ఫైకస్‌కు మంచి ఆదరణ..



బోన్సాయ్ మొక్కలకు మంచి ఆదరణ ఉంది. వెయ్యి రూపాయలు మొదలుకొని 50వేల విలువ చేసే మొక్కలు కొంటున్నారు. విలాసవంతమైన ఇళ్ల కోసం రూ.3 లక్షల విలువ చేసే మొక్కలు కొంటున్నారు. ఆర్డర్లను బట్టి ఆస్ట్రేలియా, సింగపూర్ వంటి దేశాల నుంచి దిగుమతి చేస్తాం. వాటి వయస్సును బట్టి ధర ఉంటుంది.

– గుంజన్, పాడ్‌సే యారి నర్సరీ

48 ఏళ్లపైన మొక్కలూ...



35 ఏళ్ల నుంచి ఈ మొక్కలను తయారు చేస్తున్నాను. 48 ఏళ్ల పైబడిన బోన్సాయ్ మొక్కలు కూడా ఉన్నాయి. గతంలో రూ.3 లక్షల విలువ చేసే బోన్సాయ్‌లను పదివరకు కొనుగోలు చేశారు. నగర వాతావరణంలో జేడ్ మొక్కలు బాగా పెరుగుతున్నాయి. వీటికి జాగ్రత్తలు కూడా ఎక్కువగా అవసరం ఉండదు.

– గోవింద్‌రాజ్, ఈశ్వరీనర్సరీ, సాకేత్

పోలీస్, పొలిటికల్ లీడర్ల క్రికెట్ మ్యాచ్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ ఉపేందర్

ఆమనగల్లు: పోలీసులు, రాజకీయ నాయకుల మధ్య నిర్వహించిన క్రికెట్ మ్యాచ్ చూపరులను అలరించింది. పట్టణంలో ఐదు రోజులుగా జీఎస్ ఆర్ యువసేన ఆధ్వర్యంలో వస్పుల ప్రకాశ్ మెమోరియల్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో భాగంగా ఆదివారం పోలీసులు, రాజకీయ నాయకులు టీంలుగా ఏర్పడి క్రికెట్ ఆడారు. ఆమనగల్లు సీఐ జాల ఉపేందర్ కెప్టెన్‌గా పోలీసు టీం, మున్సిపల్ బీఆర్ఎస్ కన్వీనర్ పత్యానాయక్ కెప్టెన్‌గా పొలిటికల్ టీంలు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన పొలిటికల్ టీం 12 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 69 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన పోలీస్ టీం 12 ఓవర్లలో 66 పరుగులు చేసి 3 పరుగుల తేడాతో ఓడిపోయారు. ఈ పోటీలలో ఆమనగల్లు ఎస్ఐ సుందరయ్య, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్, మార్కెట్ వైస్ చైర్మన్ తోట గిరియాదవ్, మున్సిపల్ టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్, నాయకులు రమేశ్, దేవేందర్, రాజు, సయ్యద్ ఖలీల్, ప్రసాద్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, సంఘం నాయకులు

టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలుగౌడ్

షాద్‌నగర్‌రూరల్: విద్యా, ఉద్యోగ, ఉపాధ్యాయ రంగంలో ఎదర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిర్వహించే రాష్ట్ర ఐక్య ఉధ్యాయ ఫెడరేషన్(టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి నర్సింలుగౌడ్ అన్నారు. ఆదివారం ఆయన ఈ మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఈ నెల 13, 14న సాగర్‌రోడ్ మన్నెగూడ చౌరస్తాలోని బీఎంఆర్ సార్థా కన్వెన్షన్‌లో టీఎస్‌యూటీఎఫ్ 5వ మహాసభలను ఈ నెల 13, 14న నిర్వహిస్తామని చెప్పారు. ఈ మహాసభలను విజయవంతం చేసేందుకు డివిజన్‌లోని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు అధిక సంఖ్యతో తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శివారెడ్డి, శ్యామలాదేవి, సత్యం, శేఖర్‌గౌడ్, కృష్ణ, బాలయ్య, సమత, శ్రీనివాస్, అరుణ, లక్ష్మీదేవమ్మ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

పుష్పయాగం.. ఆధ్యాత్మిక శోభితం

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ వేంకటగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం పుష్పయాగం , లక్ష పుష్పార్చన కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. పుష్పయాగం కోసం దేవాలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. యాగంలో భాగంగా వేంకటేశ్వర స్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామివారికి ఆలయ అర్చకుడు గూడ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆలయ మండపంలో భక్తులతో కలిసి వివిధ రకాల పుష్పాలతో పుష్పయాగం నిర్వహించారు. స్వామివారికి లక్ష పుష్పార్చన చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామికి నిర్వహించిన పుష్పయాగం



పుష్పయాగంలో పాల్గొన్న భక్తులు

కొనసాగుతున్న వాలీబాల్ టోర్నమెంట్

ఫైనల్‌కు చేరిన కొందుర్గు, షాద్‌నగర్ జట్లు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మిథున్ రెడ్డి

కొందుర్గు: ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 16వ రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ కొనసాగుతోంది. ఆదివారం రూరల్ విభాగంలో 42 జట్లు పాల్గొనగా చిన్న రేవెళ్లి, షాద్‌నగర్, ఐనాపూర్, కొందుర్గు సెమీ ఫైనల్‌కు చేరాయి. ఇందులో ప్రతిభచూపిన కొందుర్గు, షాద్‌నగర్ ఫైనల్‌కు చేరాయి. కాగా ఓపెన్ టూ ఆల్ 8 జట్లు పాల్గొన్నాయి. కాంగ్రెస్ నేత వీర్లపల్లి శంకర్, బీజేపీ నేతలు మిథున్‌రెడ్డి, అందె బాబయ్య, శాంతకుమార్ తదితరులు హాజరై క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రాజేశ్ పటేల్, శ్రీధర్ రెడ్డి, శ్రీశైలం, కృష్ణారెడ్డి, యాదయ్య, నరేందర్, మహేందర్, వెంకటేశ్వర్ రెడ్డి, కుర్మయ్య పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంజాపూర్ గ్రామానికి చెందిన బర్రు నాగరాజు(38) ప్రైవేట్ ఉద్యోగి. రోజు మాదిరిగానే శనివారం సాయంత్రం రాగన్నగూడ పాఠశాల నుంచి తన కూతురిని బైక్ మీద ఇంటికి తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో మస్కటి వద్ద ఓ వ్యక్తి వేగంగా రోడ్డుదాటుతున్నాడు. అతన్ని తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి నాగరాజు కింద పడిపోయాడు. తలకు బలమైన గాయమవ్వడంతో బాధితుడిని నగరంలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

వేధింపుల భర్తను కడతేర్చిన భార్య

శంషాబాద్ రూరల్: నిత్యం మద్యం తాగి వచ్చి వేధిస్తున్న భర్తను కడతేర్చింది ఓ భార్య. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ననాజీపూర్‌నకు చెందిన ఒల్కె రాజు(40), జ్యోతి దంపతులు. కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. రాజు నిత్యం మద్యం తాగి వచ్చి భార్యను హింసించేవాడు. శనివారం రాత్రి తాగిన మత్తులో ఆమెపై దాడికి పాల్పడ్డాడు. దీంతో ఎదురుదాడికి దిగిన జ్యోతి కత్తితో అతని తల భాగంలో పొడిచింది. తీవ్ర గాయాలైన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.